# 30. పరోపకారి

రాత్రంతా తాను మేలుకొని ఎంతో హుషారుగా ఉండవలసిన పని ఉన్నదని తెలిసికూడా ఎంత ప్రయత్నించినా రాముడికి ఆ పగలు నిద్ర పట్టలేదు.

రాత్రి తాను జొరబడి దోచుకోవలసిన ఇంటిని క్రితం రోజంతా ఎంతో జాగర్తగా పరిశీలించాడు. ఇంట్లో నవయవ్వని ఐన అందగత్తె–బహుశా టీచరై ఉండాలి – ఒక్కతే ఉన్నది. ఆమె వొంటి మీద నగలు చూశాక, తాను దోచుకోదగిన ఇల్లేననే నిశ్చితాభిప్రాయం కలిగింది రాముడికి.

పదిమంది ఉన్న ఇంట్లోకి జొరబడటం – ఒక్కరే ఉంటూన్న ఇంట్లో పడటానికి పది రెట్లెక్కువ రిస్క్ అనే సంగతి వాడికి తెలుసు. ఈ ఇంటికి వెనుక భాగంలోని పిట్టగోడను తేలిగ్గా దూకగలడు. దొడ్డి తలుపుకు సన్నని సందున్నదనే విషయం వాడి గద్దకళ్ళు కనుక్కున్నవి. చురకత్తిలాటిదాన్ని సందులోంచి ప్రయోగిస్తే తలుపులు తెరుచుకొని తేలిగ్గా తనకు ప్రవేశం దక్కుతుందని వాడి అంచనా.

ఆమె – అవతలి గదిలో పడుకొని ఉంటుంది. ఆ బంగారు ఆభరణాల్ని ధరించే ఉంటుందా? లేక వేరొకచోట దాచి ఉంటుందా అని వాడు తీవ్రంగా ఆలోచించాడు.

అవి ఆమె వొంటి మీదనే ఉంటే ఎక్కడున్నవని వెతక నవసరం లేదు. ఐతే వాటిని లాగటం చచ్చేపని! ఎంత జాగర్తగా కత్తిరించి లాగినా, ఎక్కడో అక్కడ ఇరుక్కునిపోయి నిద్రించే వ్యక్తికి నిద్రాభంగం జరగకుండా, తేలిగ్గా ఊడిరావు.

ఐతే ఆమె మరెక్కడన్నా దాచి ఉంచుతే, ఎక్కడున్నవో వెతక్క తప్పదు. వేసిన తాళాల వెనుక అవి ఉంటే, తాళాన్ని తెరవటం, వెతికి వాటన్నిటినీ స్వాధీనం

చేసుకోవటం మొదలైన శ్రమ పడక తప్పదు. ఎటు చూసినా అవి వేరొక తావులో దాచబడి ఉండటమే మంచిదనిపించింది వాడికి. తన పని పూర్తి చేసుకునేలోగా ఆ టీచ రొక్కతే మేలుకోకుండా ఉంటే చాలు. ఆమె మేల్కొని అరిచి గోల చేస్తే వెనుకదారిగుండా నిష్క్రమణ మార్గం ఉండనే ఉన్నది. తన గొడవలో తాను ఉండగా వెనుకవాటుగా తనను ఆమే బంధిస్తే – తన శక్తియుక్తులన్నిటినీ ప్రయోగించి, గుంజుకొని బైటపడాలి. అవసరమైతే ఆమెను విదిలించుకొనో, బాధించో, కొట్టో, పీకో, రక్కో, కరిచో – సొత్తు చేతికి అందకపోయినా ఇనుప కటకటాల వెనుక బంధితుడు కాకుండా చూసుకొని – చావుతప్పి కన్ను లొట్టబోయి బైటపడాలి. సుకుమారిని బాధించటం తనకు ఇష్టంలేదు. అవసరమైతే తనను పట్టుకొన్న వ్యక్తిని చంపయినా సరే బైటపడక తప్పదనే 'చోర నియమం' తనకు తెలిసిందే ఐనా చూస్తూ చూస్తూ తాను అంత ఘోరాన్ని నిర్వహించలేడు సరికదా – ఎవరైనా ఖూనీ చేస్తుండగా కూడా చూసి నిలవతొక్కుకోలేడు. ఇంతకూ తన అదృష్టం ఎలా ఉన్నదో ప్రయోగంలో తప్ప తేలదు!

ఇలాటి చిత్ర విచిత్రమైన తలపుల గుంపులు నిద్రాదేవిని రాముడి దరిదాపుల్లోంచి తరిమివేసినవి. యీ రాత్రి త్వరగా సొత్తు చేజిక్కించుకొని బైటపడితే, ఆ తరువాత నిద్ర దానంతటదే వొస్తుంది.

వాడి జీవితంలో ఇప్పుడు ప్రయత్నించదలచిన చౌర్యం మూడోది. మొదటి రెంటిలోనూ అదృష్టం కలిసివొచ్చి పట్టుబడలేదు. అయితే అనుకున్నంత సొత్తు దొరకలేదు. ఆ దొరికిన దాంతోనే ఈ ఆరు నెలలూ కాలక్షేపం చేశాడు. రెండు ప్రయోగాల అనుభవాన్నీ నెమరు వేసుకుంటూ ఇంకా తెలివిగా ముందు ప్రయోగాలు జరపాలనీ, క్రమంగా తను కూడా ఆరితేరిన గజదొంగ కావాలనీ వాడి ఆశయం. ఐతే దురాశ ప్రమాదకరమైనదని వాడికి తెలుసు, అందినంతవరకే గుంజుకొని ఎలాగో రోజులు దొర్లిస్తే చాలనే తృప్తిని ఆశ్రయించాడు.

చలి ఎముకలు కొరుకుతోంది. మంచు కూడా కురుస్తోంది. ఇలాటి వాతావరణంలో వెచ్చగా పడుకునే అవకాశమున్నవాళ్ళు గాఢనిద్రలో ఉంటారు. ఇప్పుడు బయలుదేరి వెళ్ళటం బాధగా ఉన్నా 'ఆమె' బహుశా వెచ్చగా, హాయిగా ముడుచుకొని సుఖనిద్ర పోతూంటుంది. తనకు అప్పుడే వాటం!

రాత్రి పదకొండు దాటింది. ఊరకుక్కలు కూడా తోకలు ముడుచుకొని పడుకున్నవి. వీధంతా అతి ప్రశాంతంగా ఉన్నది.

రాముడు అటూ యిటూ చూసి మెల్లిగా పిట్టగోడ మీది నుంచి దొడ్లోకి ఉరికాడు. ఆతృత వేధిస్తూండటంవల్ల ఎంతో అలసటగా ఉండి ఆ గోడ పక్కనే కాస్సేపు

కూలబడ్డాడు. చుట్టుపక్కలంతా గాఢాంధకారం. మెల్లిగా తన కళ్ళకు ఆ చిమ్మచీకటిని మాలిమి చేశాడు.

చలికి కాళ్ళు కొంకర్లు పోతూన్నవి. ఎక్కువసేపు యీ ఆరుబైట ఉండటం మంచిది కాదు. పిల్లివలె నడుస్తూ దొడ్డి తలుపు దగ్గిరికి వెళ్ళి, తలుపుకు చెవి ఆనించి లోపల్నుంచి శబ్దాలేమైనా వినబడతవేమోనని చూశాడు. అలాటి సూచనలే లేవు. ఆమె గాఢనిద్రలో ఉండి వుండాలి.

తలుపుల మధ్య ఉన్న సందులోంచి సన్నని వెలుగు కిరణం పొడుచుకొస్తోంది. ఆమె మేలుకొనే ఉండి చదువుకుంటోందేమో అన్న ఊహ రాముడికి కలిగింది. కాని ఆ కాంతికిరణం చాలా బలహీనమైనది కావటంవల్ల, నైట్ లాంప్ తాలూకుదై ఉండొచ్చు. ఆ వెలుగు చదివేందుకు చాలదని రాముడి లోకజ్ఞానం నిశ్చయించింది.

మెల్లిగా చురకత్తిని అడుగునుంచి తలుపుల చీలికలోకి జొనిపించి పైకి ఎత్తాడు. గడియకు అది తగలగానే, మళ్ళీ కిందికి పోనిచ్చి యీసారి బలంగా పైకి నెట్టి ఆ కత్తిని అలాగే పట్టుకున్నాడు. గడియ ఊడి అటూ ఇటూ కొట్టుకొని శబ్దం చేయకుండా, అది కిందికి దిగగానే కత్తి దాన్ని ఆపి ఉంచుతుందనే వాడి ఊహ సరైనదే!

మెల్లిగా తలుపు నెట్టి లోనికి ప్రవేశించాడు. అక్కడి వాసన్నుబట్టి అది వంటిల్లని వాడి నాశికలు నిర్ధారణ చేసినవి. చప్పుడు కాకుండా, జాగ్రత్తగా, మెల్లిగా మళ్ళీ గడియ వేశాడు. తాను లోపల ఉండగా 'ఆమె'కు మెలుకూ వొస్తే, తాను దేని చాటునైనా దాక్కోవచ్చు! 'ఆమె' ఏ కాలకృత్యానికో దొడ్డి తలుపు తీసుకోవలసి వస్తే, వేసిన గడియ వేసినట్లే ఉంటుంది కనుక, ఆమెకు అనుమానం రాదు. అంత జాగర్తగా ఆలోచించాడు రాముడు.

వంట ఇంటి మూలలో నక్కి నిశితంగా పడక గదిలోకి చూశాడు. చీకటికి అలవడిన వాడి కళ్ళకు ఆ నైట్ లాంప్ వెలుగులో పడకగదంతా పట్టపగటివేళ చూసినట్లయింది. మెత్తని తలగడాల మీద తల ఆన్చి, చెవుల దాకా రగ్గు కప్పుకుని క్రమవిధానంలో వూపిరి పీలుస్తున్నదామె. ఒక పక్కకు తిరిగి పడుకోవటంవల్ల ఇప్పుడామె మొహం రాముడికి స్పష్టంగా కనిపిస్తోంది.

ఇంత దగ్గిర్నుంచి చూశాక ఆమె మొహం - రెండేళ్ళ క్రితం ఆత్మహత్య చేసుకున్న వాడి అక్క మొహం వలెనే తోచింది. ఇంత పోలిక ఉంటుందని వాడు ఊహించలేదు. తన అక్క నిద్రిస్తుంటే ఎలా ఉండేదో, యీమె వాలకం కూడా సరిగ్గా అలాగే ఉన్నది. ఆ షావుకారు కొడుకు అక్రమంగా బలాత్కరించి, తన అక్కకు మానభంగం చేస్తే, ఆ అవమానాన్ని భరించలేక ఆమె ఆత్మహత్య చేసుకుంది. అప్పుడు - అప్పుడేమిటి - ఇప్పటిక్కూడా తనెంత దుఃఖపడుతున్నాడు! ఆ షావుకారు కొడుకు మీద కూడా తాను ప్రతీకారం తీర్చుకోవాలి.

తన అక్క బతికివుంటే తన కీ పాట్లు ఉండేవి కాదు. ఆమె పని పాటలు చేసి సంపాయిస్తే తాను చదువుకొని ఉద్యోగస్థుడై సంపాయించి, అక్కకు పెళ్ళి చేసేవాడు! తన స్వప్నాలన్నీ భంగపడినై. తనను ఆదరించే వాళ్ళు యీ ప్రపంచంలో లేరు. యీ ప్రపంచమంతా తనమీద కత్తికట్టింది; అందుకే తా నీ ప్రపంచం మీద కసి తీర్చుకోవాలి. తన యీ దుష్ట ప్రవర్తనను సమర్థించుకోవడంకాదు కాని, ఇంతకన్న మరో మార్గాన్ని చూపలేని యీ లోకంతో తనకు విరోధం తప్పటమెలా?

లోపలి కొచ్చాక కాస్త వెచ్చగా హాయిగా ఉన్నదనుకుంటే యీ నిద్రా ముద్రిత సుందరిని చూశాక తన అక్క జ్ఞాపకం వొచ్చి హృదయాన్ని గడ్డ కట్టించింది. శీతల ప్రవాహాలు వెన్నెముకల్లోంచి ప్రవహిస్తున్న ట్లనిపించింది. ఆ దుఃఖావేశంలో రాముడు గిలగిల్లాడాడు.

ఏమిటి – తన కీ భ్రమలు! తన అక్క చచ్చి రెండేళ్ళు గడిచింది. ఈమెలో తన అక్క పోలిక లున్నంత మాత్రాన తన అక్కే ఎలా అవుతుంది? యీ కథంతా చెప్పి, తననో తమ్మునివలె చూసుకోమని ప్రాధేయపడితే యీమె అంగీకరిస్తుందా? 'దొంగ వెధవా!' అని తనకు దేహశుద్ధి చేయించి పోలీసులకు అప్పగించదా? ఐనా తాను వొచ్చిన పనేమిటి? తన యీ వెధవ మనస్సు లాగేదేమిటి? చచ్చిన తన అక్కను గూర్చి విచారపడేందుకు ఇదా సమయం? తన అక్క పేరు పద్మ...యీమె పేరేమిటో?

ఈ పాడు ఆలోచనల్నుంచి తనను తాను విడివరచుకునేందుకు ఒక్కసారి ఒళ్లు విరుచుకున్నాడు రాముడు. తనకు తెలియకుండానే అశ్రుపూరితాలయిన కళ్ళు తుడుచుకున్నాడు. ఇక యీమె మొహం చూసి మనసు పాడుచేసుకోరా దనుకున్నాడు. యీ ప్రదేశంలో ఎక్కువసేపు ఉండటం క్షేమకరం కాదని తెలుసు. తన పని త్వరత్వరగా పూర్తి చేసుకొని యీ సివంగి గుహలోంచి సివంగి మేల్కొనక పూర్వమే తోక ముడవాలి!

ఏ విధమైన ఆలోచనలకూ ఇది సమయం కాదు; ప్రతి క్షణం అమూల్యం! తనేం చేసినా, ఏం చెయ్యకపోయినా క్షణాలు దొర్లిపోతూనే ఉంటవి కదా!

రాముడు మెల్లిగా పడకగదిలోకి వెళ్ళాడు. ఒక్కసారి పరికించి చూశాడు. పట్టెమంచం మీది మెత్తని పరుపుమీద ఆమె పక్కకు తిరిగి గాఢనిద్రలో ఉన్నది. ఆమె శరీరం మీద ఆభరణాలు ఉన్నవో లేవో వాడికి తెలియలేదు. వెనుక వైపుగా వెళ్ళి మెడ వెనుకభాగం చూశాడు. మెడలో నగలేమీ లేవు. ఈమెకు నిద్రాభంగం కాకుండానే పని పూర్తి చేసుకోవొచ్చునుకున్నాడు. ఆమె శరీరం మీద చేయి వేయాల్సిన ఖర్మ పట్టనందుకు సంతోషించాడు. మళ్ళీ ఆమె ముఖం చూస్తే పాత జ్ఞాపకాలన్నీ మనస్సును దేవుతయ్యేమోననే భయం వుంది. అందుకని క్షణక్షణమూ ఆ విషయాన్ని జ్ఞాపకం చేసుకొంటూ మనస్సును హెచ్చరించుకున్నాడు.

రెండు ట్రంకుపెట్టెలూ, ఒక చిన్న స్టీల్ కాబినెట్టూ వాడి కళ్ళబడినవి. ఈ మూటిలోనే ఆమె నగలూ, నాణాలూ దాచి ఉంచే అవకాశం ఉన్నది. పెట్టెలకు తాళాలున్నట్లు లేదు. స్టీల్ కాబినెట్‌కు తాళం వేసి ఉన్నదేమో?

మెల్లిగా హాండిల్‌ను కిందికి లాగాడు. తెరుచుకునేప్పుడు కిచకిచ లాడు తుందేమోనని భయపడ్డాడు. ఐతే అది తెరుచుకోలేదు. కనుక తాళం వేయబడి ఉండాలి. దీన్ని పగలకొట్టడం సాధ్యపడదు. చాలా శ్రమ పడాలి. అదీగాక ఎంతో శబ్దమై ఊరు ఊరంతా లేస్తుంది. కాబినెట్ తాళంచెవులు 'ఆమె' తనకు దగ్గిర్లోనే ఉంచుకొని ఉండాలి.

ఇలాటివి సాధారణంగా దిండుకింద దాచి ఉండటం వాడికి తెలుసు. ఎవరైనా తీసేందుకు ప్రయత్నించినా, మెలుకువ వొస్తుందనే ఉద్దేశ్యమే ఇందుకు కారణం.

రాముడు ఆమె తలకు వెనుకభాగంలోకి వెళ్ళి మోకాళ్ళమీద కూర్చొని, మెల్లిగా చేతిని తలగడకిందికి పోనిచ్చాడు. సెంటీమీటర్, సెంటీమీటర్‌గా చేతిని అటు పక్కకు జరుపుతూ, వేళ్ళకు తాళంచెవులు తగులతవేమోనని పరిశీలిస్తున్నాడు.

ఉన్నట్టుండి ఆమె హఠాత్తుగా తల జరిపి సర్దుకొని పడుకుంది. ఆమె తల బరువంతా ఇప్పుడు రాముడి చేతిమీదనే పడింది. వాడి చేతికీ, ఆమె తలకూ మధ్య మెత్తని తలగడ అడ్డు ఉండటంవల్ల ఆమెకు నిద్రా భంగ మవలేదు. ఆమెను నిద్రనుంచి లేపడం రాముడి ఉద్దేశ్యం కాదు. వాడు ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా ఎందుకని ఆమె కదిలి తన చేతిమీదనే తల భారమంతా వేసిందో వాడికి తెలియలేదు. చెయ్యి సంగతి తరువాత చూసుకోవచ్చు. ఆమె మొహం ఇటు తిప్పుతే కొంప లంటుకునేవి. ఎందుకైనా మంచిదని రాముడు తన మొహాన్ని మంచం కిందికి లాక్కున్నాడు.

ఆ స్థితిలో ఒక పావుగంట వేచి ఉన్నాడు. మోకాళ్ళు నొప్పి పెడుతున్నవి; చేతిలో రక్తప్రసారం జరగనందువల్ల బాధపెడుతోంది. ఇప్పుడు చేతిని కదపటం దూరాన ఉన్న ప్రమాదాన్ని పేరుపెట్టి పిలవడమేనని వాడికి తెలుసు. ఆమె గాఢనిద్రలో ఉండగా మెల్లిగా చెయ్యి లాక్కోవాలి; అంతకన్న మార్గం లేదు. తొందరపడితే అసలుకే మోసం జరగవొచ్చు.

మరో పావుగంట గడిచాక ప్రయత్నించకుండా ఉండలేకపొయ్యాడు రాముడు! మెల్లిగా వేళ్ళు కదిలించాడు. ఆమె కదలలేదు! సెంటీమీటర్ సెంటీమీటర్‌గా చేతిని కిందినుంచి పైకి కదిపాడు. ఇందువల్ల చేయి పయనించవలసిన దూరం చాలా తగ్గుతుంది. అడ్డదారిలో తొందరగా గమ్యస్థానం జేరటం లాటిదిది.

మహా జాగ్రత్తగా చేతిని ఉపసంహరించుకో గలిగాడు రాముడు. చెయ్యి మొద్దుబారినట్లుంది; తిమ్మిరి తిమ్మిరిగా వుంది. చేతిని విదిలించాడు: గిరగిరా తిప్పాడు. ఐదారు నిమిషాలక్కాని ఆ చేయి వాడి స్వాధీనంలోకి రాలేదు.

మొదట్లో అంతా అదృష్టం కలిసొచ్చినట్టుగానే ఉన్నది. రానురాను యీ క్లిష్టపరిస్థితు లేమిటీ? ఈమె తన అక్క ఎలా అవుతుంది? తను భ్రమ పడుతున్నాడు – అంతే! ఈమెలో తన అక్క గుణాలు మచ్చుకైనా ఉంటే, తన మీద ఏమాత్రం అభిమానమున్నా, ఆ అనురాగం వల్ల తను దోచుకునే దాకా కిక్కురుమనకుండా ఉండాలి; అంతేకాని యీ దోబూచులాడటం దేనికీ?...

తాళాల గుత్తికోసం ప్రయత్నం చేద్దామా అనే ఆలోచనలో ఉండగా, ఆమె వొత్తిగిలింది. చప్పున రాముడు మంచం కిందికి దూరాడు. ఈ వెధవ మంచంలో నల్లు లున్నవేమో? అవి ఆమె సుఖనిద్రకూ, తన లాటి చోరుల క్రీడలకూ పరమ శత్రువులు. ఐతే అవి తన కంట్రోల్‌లో లేవు కనుక వాటి బాధను ఉభయులూ భరించక తప్పదు.

ఇంతలో 'ఆమె' రెండు మూడు సార్లు అటూ, ఇటూ కదిలి, తనకు మెలుకువ వొస్తున్నదనే సూచన ఇచ్చినట్లయింది. వెంటనే రాముడు ఆమె మంచం కిందికి దూరి ముడుచుకు పడుకున్నాడు.

తాను ఊహించినట్లే ఆమె లేచి కూర్చుంది...మంచం మీదినుంచి దిగి, లైట్ వేసింది. రాముడి గుండెలు గుబగుబలాడినవి. తన నామె గమనించిందంటే – కేకలు వేస్తుంది! లేదా తానేమైనా హాని చేస్తాడేమోనని చేతికి ఏది దొరుకుతే దాంతోటే మొత్తవొచ్చు. తన అక్క పోలికలున్న యీమెకు తానెలా హాని చేయగలడు? ఆమెను తా నెలా గాయపరచగలడు?

ఆమె లేచి దొడ్డివైపు వెళ్ళింది. దొడ్డి తలుపు తాను గడియపెట్టడం మంచిదే ఐంది. ఆమె గడియ తీసిన చప్పుడు వినిపించింది. ఆమెకు ఎలాటి అనుమానమూ కలిగేందుకు వీల్లేదు. తన తెలివితేటల్ని ఒక్కక్షణం అభినందించుకున్నాడు – రాముడు.

ఈసారి ఆమెకు గాఢనిద్రపట్టేదాకా తాను ప్రయత్నించరాదు... ఇంతలో ఆమె గడియవేసి వొచ్చి పెద్దలైట్ ఆర్పి పక్కమీద సర్దుకొని కూర్చుని, అంతలోనే పడుకుని, చెవులదాకా రగ్గు లాక్కున్నది. తన నా లైట్ వెలుగులో ఆమె గమనించకుండటం తన అదృష్టంగానే భావించాడు – రాముడు.

ఆ తరువాత ఆమె నిద్రరాక అవస్థపడుతున్నట్లు తోచింది వాడికి. మంచం అనేకసార్లు కిరకిర లాడటం, కుంగిపొయ్యే తావుల్ని మార్చుకోవటం వాడికి స్పష్టంగా తెలుస్తోంది.

ఈసారి చాలా ఓర్పును ప్రదర్శించవలసి ఉన్నదనే సత్యం రాముడి కళ్ళముందు మెదిలింది. సుఖనిద్రకు భంగం కలుగుతే, మళ్ళీ నిద్ర పట్టేందుకు చాలాసేపు పడుతుందని వాడికి తెలుసు. అప్పుడు అంత పెనుగులాట తరువాత పట్టే నిద్రనుంచి సామాన్యంగా మెళుకూ రాదు; అప్పుడు తన పని నిరాటంకంగా సాగించవొచ్చు.

ఇక్కడ ఈ గదిలో మంచం కింద కటిక నేలను పడుకున్నా ఎంతో వెచ్చగా, హాయిగా ఉన్నది. తాను త్వరత్వరగా యీ ప్రదేశాన్ని విడిచి వెళ్ళాలనే అవసరం వున్నది కాని, లేకుంటే యిక్కడే హాయిగా ముడుచుకొని పడుకోవొచ్చు.

మళ్ళీ వాడికి అక్క గుర్తుకొస్తోంది. తన అక్కవలెనే ఉన్న ఈమె సొత్తును దోచుకోవటం అన్యాయ మనిపిస్తోంది వాడికి. ఐతే ఈ ప్రపంచమే అన్యాయం, అక్రమం అనబడే రెండు చక్రాల మీదా చక చకా సాగిపోతూంటే, కేవలం తానొక్కడే న్యాయాన్ని పట్టుకొని వేళ్ళాడితే ఆ చక్రాల కింద పడి పచ్చడి కావటం తథ్యం! ఆ విషయం వాడి జీవితమంతా అనుభవపూర్వకంగా తెలుసుకుంటూనే ఉన్నాడు.

ఏలేందుకు రాజ్యాలు దొరక్క పోవచ్చు కాని దోచుకునేందుకు తనకు ఇళ్ళే కరువౌతవా? యీ ఒక్క ఇంటినీ వొదిలేస్తే పొయ్యేదేమిటి? తన అక్క అనే సెంటిమెంట్ వేధిస్తోంది. సొత్తు పోయి ఆమె లబోదిబో మంటూ ఏడుస్తూంటే తాను చూడగలడా? ఈ ఇంట దొంగతనం చేసినందుకు తన అంతరాత్మ అఘోరిస్తూనే ఉంటుంది. చచ్చిన అక్క కోసమూ, బతికి ఉండి తన అక్క పోలికలున్న యీమె బాధ కోసం కూడా తాను దుఃఖ పడటం - నిజంగా శక్తికి మించిందే అవుతుంది.

ఐతే తన వృత్తిధర్మాన్ని అనుసరించి, విధి నిర్వహణలో వెనుకంజ వేయరాదనే నియమాన్ని పాటించినట్లయితే - తాను నిర్మించుకొన్న యీ వాదాలన్నీ గాలిబుడగలే కాగలవు. అందునా ఇంట ప్రవేశించి, చేతికి అందిన సొత్తును కూడా వొదులుకొనిపోతే తన మూర్ఖత్వాన్ని తానే యీ జీవితంలో ఎప్పుడన్నా క్షమించగలడా? మొగదిక్కు లేని ఒంటరికత్తె - తగిన ప్రతిఫలం చిక్కే అవకాశాలూ, సగందూరం వొచ్చిన పరిస్థితీ - ఇవన్నీ చూస్తూ చూస్తూ వొదులుకునేందుకు తాను దొంగ కాదనుకోవాలి. అది అసంభవం!

ఇలా ఆలోచిస్తూ ఆలోచిస్తూండగా రాముడికి నిద్ర ముంచుకొచ్చింది. 'నిద్ర సుఖమెరుగదు' అన్న సామెతకు తోడుగా ఇక్కడ ఆ సుఖం గూడా ఉండటం వల్లా, పగలల్లా నిద్రపోనందువల్లా, రాముడు తనకు తెలియకుండానే నిద్ర పోసాగాడు. అది వాడి ఉద్దేశం కాకపోయినా నిద్రాదేవికి లొంగక తప్పలేదు.

## 2

శబ్ద తరంగం చిన్నదైనా స్పష్టంగా వేలు ముడిచి తలుపు కొడుతున్న చప్పుడు స్పష్టంగా రాముడికి వినిపించిది. ఆ తరువాత మృదువుగా "పద్మా! పద్మా!" అన్న పిలుపు కూడా వాడి కర్ణపుటాలను జేరింది. కంఠ స్వరాన్ని బట్టి పురుషుడే నని కూడా వాడికి అర్థమైంది.

ఈమె పేరు పద్మ! తన అక్క పేరు కూడా అదే; ఇంతకు ముందు ఆమె మెడ పరిశీలించినప్పుడు పసుపుతాడు లాటి దేమీ కనిపించలేదు; అవివాహిత ఐ ఉంటుం దనుకున్నాడు. ఇప్పుడు యీ అర్ధరాత్రి ఎవరో పురుషుడు పిలుస్తూంటే - యీమెకు మొగదిక్కు లేదని తాను వేసిన అంచనా తలక్కిందులైన దనిపిస్తోంది.

ఈ వొచ్చింది - ఆమె రక్తస్పర్శ ఉన్న బంధువేమో? లేక ప్రియుడేమో? అతను ప్రియుడైనట్లయితే - తెల్లవారేదాకా వీళ్ళిద్దరూ నిద్రపోరు. అంతేకాదు - ఏక శయ్యాగతులై మంచం మీద వాళ్లు నిర్వహించే శృంగార రసపోషణ తన కళ్ళ పడకపోయినా - తాను మంచం తాలుకు నీలుగుళ్నీ, రక రకాల కూతల్నీ వింటూ ఉద్రేకపడకుండా వుండగలడా? వాళ్ళు తెల్లారేదాకా యీ తతంగం జరుపుతే, తెల్లారాక తాను పట్టుబడటం తథ్యం! ఎంత ఖర్మ పట్టిందీ!

ఆమె మొద్దు నిద్దర్లో ఉన్నట్లుంది. తలుపు మీది శబ్దమూ, కంఠ స్వరమూ శృతిమించినా ఆమె లేవలేదు. తన నీ వెధవ నిద్ర ఆవహించి ఉండనట్లయితే, యీపాటికి దోపిడి పూర్తి చేసుకొని సురక్షితంగా బైటపడే వాడు కదా! తన నిర్లక్ష్యాన్ని దూషించుకోవటం తప్ప ఇప్పుడు చేసేదేమీ లేదు.

ముద్దు ముద్దుగా పేరుపెట్టి పిలిచే ఆ కంఠస్వరాన్ని బట్టి ప్రియుడే ఐ ఉండాలనిపిస్తోంది. ఇప్పుడు రాముడి దృష్టి దోపిడి మీద లేదు. ఈసారికి ఎలాగో బతికి బైటపడితే ఇంకోనాడు చూసుకోవచ్చు. టేబిల్ మీద ఉన్న బిగ్‌బెన్ ఒంటి గంట దాటి ఐదు నిమిషాలైందని సూచిస్తోంది. మంచి అవకాశాన్ని పాడు చేసుకున్నాడు!

మరో రెండు నిమిషాలు గడిచాక ఆమెకు మెలుకూ వొచ్చింది. లేచి కూర్చున్నట్లుంది. నిద్ర కళ్ళతోనే మెల్లిగా తలుపువైపు నడిచింది. అక్కడ ఆగి "ఎవరూ?" అంది.

"నేనే!"

ఆమె ఒక నిమిషం సందేహించినట్లూ, నిర్ణయించుకోలేకపోయినట్లూ అక్కడే నిలబడింది. ఆ తరువాత తలుపు తెరిచింది.

నవ యువకుడు, బలిష్ఠుడైన నవనాగరికుడొకడు పెనుగాలివలె లోన ప్రవేశించాడు.

"నీ దింత మొద్దు నిద్దరేం? పది నిమిషాల నుంచీ తలుపు కొడుతున్నా జవాబే లేదు!" అన్నాడా యువకుడు.

ఆమె గడియారం చూసినట్లుంది.

"ఒంటి గంటా పది నిమిషాలైందిప్పుడు. ఇంత రాత్రివేళ మీ రొస్తారని కలగన్నానా!"

ఆ కంఠస్వరం ఎంత మధురంగా, తన అక్క గొంతువలెనే ఉన్నదో!

యువకుడు తలుపు గడియపెట్టి వొచ్చి కుర్చీలో కూలబడ్డాడు.

"ఎందుకూ - ఇంత రాత్రివేళ వొచ్చారు?"

"ఏం - రాకూడదా?"

"ఎవరైనా చూస్తే?"

"అందరూ చలికి ముడుచుకొని సుఖనిద్రల్లో ఉన్నారు - నా బోటి ప్రేమ బికారులు తప్ప! ఎవ్వరూ చూడలేదులే!"

"ఐతే మాత్రం? -"

"ఎలాగూ రెండు నెలల్లో పెళ్ళాడబోతున్నాంగా! ఎవరైనా చూస్తే మాత్రమేం? ....ఏం దూరంగా నిలబడ్డావ్! అంత సిగ్గెందుకో! ఇక్క డెవరున్నారనీ!...రా..."

ఆ యువకుడు లేచి వెళ్ళి ఆమెను వాటేసుకున్నాడు.

"ఏమిటీ వింత ధోరణి...వొదలండి!" అన్నది పద్మ.

"ఇంకా బెట్టెందుకో!"

"అబ్బ! చెపుతుంటే మీక్కాదూ?...జాకెట్ చిరుగుతుంది!" ఆమె గొంతులో అసహ్యం, చిరాకూ మేళవించినవి.

"ఈ పిన్నీసులూ, బ్రహ్మముడులూ మొగాడికి లొంగుతవా?"

ఆమెను గాఢంగా కావిలించుకొని నలిపేస్తున్నట్లున్నాడు.

"ఏమిటండీ మరీ ఇదిగాను!...వెళ్ళండి...అబ్బ! చెపుతూంటే మీక్కాదూ? పెళ్ళయ్యాక యీ ముచ్చట్లన్నీ ... ఇంత మోటుతనమా? వొదలండీ!" ఆమె గుంజుకుంటున్నట్లుంది.

"ఇంత దూరం వొచ్చాక వొదులుతానా!"

ఏమిటి వీడి వింత ధోరణీ, అధికారం అనిపించింది రాముడికి. పశువల్లే ఆమెమీద పడి - మానభంగం చేసేందుక్కూడా వెనుకాడని విధంగా ఉన్నది.

ఇద్దరూ కలియబడ్డట్లున్నారు. మంచంమీద జరిగే ఆ యుద్ధపు తీవ్రతకు మంచం మూలుగుతోంది. ఆ ప్రశాంత వాతావరణంలో వారి దీర్ఘ ఉచ్ఛ్వాస నిస్వాసాలు - బుసలు కొడుతూన్నవి.

"నన్ను వొదలండి ముందు...ఇక్కణ్ణుంచి వెళ్ళి పొండి" అన్నదామె, దుఃఖం పొంగిపొర్లే స్వరంతో. తన అసహాయతను ప్రార్థనా పూర్వకంగా వెల్లడించింది.

వాడు వొదిలినట్లు లేదు.

"అరుస్తాను!"

"అరు...నలుగురూ మెచ్చుకుంటారు! కాబొయ్యే భర్తను నేను ... నాకు లొంగేందుకు నీలుగు డెందుకంట!"

వాడు బలాత్కరిస్తున్నాడు. ఆమె తనను తాను కాపాడుకునేందుకు నానా అవస్థ పడుతోంది!

"అయ్యో! చీరె లాగేస్తున్నారు..మీకు మతిపోయింది!" ఆమె చీర నేలమీద కుప్పగా పడటం రాముడి కంటపడింది.

బహుశా తన అక్కను కూడా ఆ షావుకారు కొడుకు, పరమ కిరాతకుడు ఇదే విధంగా మానభంగం చేసి ఉంటాడు! భారత స్త్రీకి పరమ పవిత్రమైన 'మానం' భంగపడుతుంటే, శక్తి సామర్థ్యాలున్న తాను చూస్తూ ఊరుకోవలసిందేనా? తన అక్క గతి పట్టేందుకు సిద్ధంగా ఉన్న యీ అతివను తాను రక్షించలేడా? ఇలా ఆలోచిస్తూ కూర్చుంటే పుణ్యకాలం కాస్తా గడిచిపోదా?

రాముని రక్తం ఆవిర్లు కక్కుతోంది! ఆ యువకుని మీద కోపం, జుగుప్స, అసహ్యం మొదలైన ఉద్రేకాలు వాణ్ని నిలవనీయటం లేదు. తాను దొంగననే విషయం వాడు మరిచిపొయ్యాడు. ఆ కామోద్రేకిని, బలిష్ఠుణ్ని ఎదుర్కోగలనా, లేనా అనే ఆలోచనే వాడికి రాలేదు. ముందు ఆమె మానభంగం జరగకుండా కాపాడవలసిన వాడి బాధ్యత వాణ్ణి ఉసిగొల్పింది.

ముందు వెనుకలు ఆలోచించకుండా మంచం కిందినుంచి నేలబారుగ్గా పాకి, ఒక్కసారిగా లేచి నిలబడ్డాడు. పద్మను బలాత్కరిస్తున్న ఆ యువకుని మీదికి లంఘించాడు. అతని మొహం మీద బలంగా ఒక్కగుద్దు గుద్దాడు. ఆ యువకుడు సరాసరి తలుపు మీద పడ్డాడు.

"ఆమెను ముట్టుకుంటే డొక్కచీరేస్తాను!" అన్నాడు రాముడు కందగడ్డల్లే మొహం చేసుకొని సీరియస్‌గా.

పద్మకు నోట మాట రాలేదు. ఈ హఠాత్పరిణామంలోనూ, మొహం పగిలే విధంగా తగలిన దెబ్బలోనూ ఆ యువకుడు నిర్ఘాంతపొయ్యాడు. రెండు క్షణాలపాటు సజీవ వ్యక్తులందరూ అచేతను లయ్యారు.

ఆ యువకుడు మెల్లిగా లేచాడు. తన మీద కలియబడేందుకు సిద్ధ పడు తున్నాడేమోనని రాముడు పిడికిలి బిగించి, పళ్ళు బిగబట్టి, కండరాలను బిరుసెక్కించుకున్నాడు.

పద్మ మెల్లిగా చీర తీసుకొని, చుట్టుకుంటోంది.

ఆ యువకుడు తలుపు తెరిచి - పెద్దగా, ఆందోళనాపూర్వకంగా 'దొంగ!.... దొంగ!" అని అరిచాడు.

అప్పటిక్కాని రాముడి ఉద్రేకం చల్లారి ఎదుట ఉన్న ప్రమాదం సంగతి తెలిసిరాలేదు. తాను దొంగననే విషయం వాణ్ణి హెచ్చరించింది. పుణ్యానికిపోతే పాపం ఎదురైంది! ఇప్పుడు తెరిచి ఉన్న యీ ద్వారంనుంచి బైటపడటమే మార్గం.

రాముడు విల్లువిడిచిన బాణంవలె ఆ ద్వారం వైపు పరుగెత్తాడు. ఐతే అక్కడ పద్మవ్యూహ ముఖద్వారంలో నిలబడిన సైంధవునివలె ఆ యువకుడు నిలబడి వున్నాడు. భయంతోనూ, ఆతృతతోనూ వేగిపోతున్న రాముణ్ణి ఇలా తేలిగ్గానే ఆ యువకుడు అటకాయించాడు. అతను తోసిన తోపుకు మూడు నాలుగడుగులు వెనక్కువేసి, బేలెన్స్ తప్పి నేల కరిచాడు. ఆ సమయాన కూడా దొడ్డిదోవలో బైటపడొచ్చనే విషయం వాడికి గుర్తు రాలేదు.

ఆ యువకుడు మళ్ళీ "దొంగ! దొంగ!" అని ఎలుగెత్తి అరిచాడు.

దగ్గరవుతూన్న అడుగుల చప్పుళ్ళు స్పష్టంగా వినవొస్తూన్నవి. రాముడి ఆశలు అడుగంటినవి. మరొక్క ప్రయత్నం చేద్దామనుకునేలోగానే ఇరుగుపొరుగులు ఐదారుమంది వొచ్చిపడ్డారు. భయపడి ఛస్తున్న రాముణ్ణి బంధించటం అంత కష్టమేం కాదు.

"ఏం జరిగింది! ఎవరికన్నా గాయాలు తగిలినవా?" అన్నారొకరు.

"నేను రెండో ఆట సినిమా చూసి వొస్తున్నాను. పద్మ భయంతో 'దొంగ! దొంగ!' అని కేకవేయటం యీ దారిన పోతూ విన్నాను. మొగ దిక్కులేని ఆడదాన్ని దోచుకుందామని వొచ్చాడు. అదృష్టం బాగుండి అదే సమయంలో నే నిటుపోవటం జరిగింది. వెంటనే లోపలికి ఉరికాను-!"

ఎంత బాగా అతికేట్లుగా అబద్ధమాడాడు! అసలు జరిగిందేమిటో చెప్పే ద్దామనుకున్నాడు రాముడు. కాని వీళ్ళు చెప్ప నిస్తారా? నిజాన్ని చెప్పి తాను వీళ్ళను నమ్మించగలడా? తాను చెప్పదల్చుకున్నదంతా పోలీసులకు చెప్పుకోమంటారు. తా నెలాగూ దొంగగా చిక్కిపొయ్యాడు. కాని పెద్ద మనిషి వేషం వేసుకొని మానవతి ఐన మగువ సౌశీల్యాన్నే హరించేందుకు వొచ్చిన యీ యువకుడు తనను అడ్డం పెట్టుకొని దూసుకొంటూ, ఇంకా పెద్ద మనిషిగానే చలామణి అవబోతున్నాడు. ఏ విధంగానూ అతని చౌర్యాన్ని గూర్చి ఎవర్నీ నమ్మించలేడు. ఇంతకన్న దురన్యాయం ఉండగలదా?

ఐతే మూడోవ్యక్తి - తన అక్క రూపురేఖలు దిద్దుకొని ఉన్న 'పద్మ' ఉన్నది. ఆమె మాన సంరక్షణార్థమే తా నీ వలలో చిక్కుకున్నాడు. తనకు సహాయపడేందుకు అవతరించాడనే మాటన్నా ఆమెకు జ్ఞాపకం రాదేం! తన నీ దుస్థితి నుంచి తప్పించేందుకు ఆమె ఎలాటి ప్రయత్నమూ చేయలే దెందుకని?

సిగ్గుపడి ఛస్తూ ఏమని చెప్పు కుంటుందామె? ఆ యువకుడు చెప్పిన కట్టు కథనే అంగీకరించినట్టుగా ఊరుకున్నది. ఏది ఏమైనా - వాళ్ళూ వాళ్ళూ చివరకు ఇరుగుపొరుగులు కూడా ఒక్కటే! ఎటొచ్చీ తాను - దొంగ వెధవ ప్రపంచానికంతకూ చోరుడు! అందరికీ - యీ పెద్దమనుషులున్న సమాజానికే తాను చీడపురుగులాటివాడు.

ఇంతలో పోలీసులు రానే వొచ్చారు. రాముణ్ణి పెడరెక్కలు విరిచి కట్టి తన్నుకుంటూ లాక్కుపొయ్యారు.

"ఈమెకు కాస్త ధైర్యం చెపుతాను!" అన్నాడు ఆ యువకుడు.

ఇరుగుపొరుగులు సమ్మతించి ఎవరి గూటికి వాళ్ళు ఎగిరిపొయ్యారు.

"ఇదన్న మాట తంతు!" అన్నా డా యువకుడు తీవ్రస్వరంతో. "ప్రియుణ్ణి లోపల పెట్టుకొని నాటకం ఆడావా! తలుపు తీయటం ఇంతసేపెందుకైనదా అనే అనుమానం నన్ను వేధించింది...వాణ్ణి మంచంకింద దాచి, చీరా అదీ సర్దుకునే ఆలస్యమా!"

"వాడు నిజంగానే దొంగ!" అన్నదామె.

"ఔనౌను. నీ మానాపహరణానికి వొచ్చాడు కదూ! ఇష్టపడి అర్పించేప్పుడు కూడా దొంగతనం అంటగడుతున్నావా?"

"ప్రమాణపూర్వకంగా నాకేం తెలియదు. ఇంట్లోకి ఎప్పుడు ప్రవేశించాడో, ఎలా ప్రవేశించాడో కూడా నేను ఎరుగను!" అన్నదామె, తన మాట నమ్మమని ప్రాధేయపడే ధోరణిలో.

"రంకు నేర్చినదానివి బొంకలేవా యేం? మంచి ప్రియుడే! గుమ్మటమల్లే కండలుతేరి నవనవలాడుతున్నాడు. వీడికెంత ఈర్ష్య! వాణ్ణి నువ్వే నా మీదికి ఉసిగొల్పావని అనను కాని, నేను నిన్ను ముట్టుకోవటాన్ని వాడు సహించలేడు - పాపం!... ఎన్నాళ్ళుగా సాగిస్తున్నావ్ యీ రంకు!"

"అలాటి మాటలనకు విశ్వం! నే నేపాపమూ ఎరగను. నా పవిత్రత చెడలేదు. నీవు ఏ ప్రమాణం చేయమన్నా చేస్తాను!"

"ఇప్పుడింకేం అంటావ్! నా అదృష్టం బాగుండి యీ రాత్రి యీ వ్యవహారమంతా యాదృచ్ఛికంగా తెలిసింది కాని - లేకుంటే నన్ను పెళ్ళాడి, భర్తగా నన్ను అడ్డం పెట్టుకొని ఇలాగే వీడితోనో, వేరొకడితోనో, లేక మరి కొందరితోనో యీ రంకు నిరాటంకంగా సాగించేదానివే!"

ఆమె నిస్సహాయ స్థితిలో వెక్కి వెక్కి ఏడ్వసాగింది.

"ఇప్పుడీ దొంగ ఏడుపులుకూడా దేనికి? అంతకన్న ఏం చేయగలవు? ఈ అస్త్రానికి తిరుగు లేదనుకుంటున్నావ్ కాబోలు! లంజరికానికి నడుం బిగించినప్పుడు యీ తెలివి ఏమైందో!"

"ఈ మాట ఆ నలుగురూ జేరినప్పుడే అనకపొయ్యావా?" అన్నదామె, రోషపడి.

"అంటే నాకు పొయ్యేదేమిటి! నీ బతుకంతా బూడిదకాకుండా కాపాడాను. ఎంత బాగా నటించావ్!"

"నేను నిర్దోషిని...నీ పాదాలంటి ప్రమాణం చేస్తాను!" అని ఆమె వొంగింది.

విశ్వం తన కాళ్ళను అవతలికి లాక్కుంటూ "ఛీ! అపవిత్రమైన నీ చేతులతో నన్ను ముట్టకు...నీ బతుకు నీవు చూసుకో..నేను వెళ్ళొస్తాను...ఇలా ఎంగిలికూటికి ఆశపడకపోతే ఎందులోనన్నా పడి చావరాదూ! తూ!" అని ఉమ్మేసి విశ్వం చకచకా నిష్క్రమించాడు.

పద్మ కుప్పవలె మంచం మీద కూలబడింది. అశోకవృక్షం కింది సీతమ్మవారి లక్షణాలన్నీ ఇప్పుడు పద్మలో స్పష్టంగా కనిపిస్తున్నవి.

క్షణంలో అంతా కూలిపోయింది. ఏది ఎందుకు, ఎలా జరిగిందో ఆమె ఆకళింపు చేసుకునేందుకు ప్రయత్నించింది.

ఆ వొచ్చిన దొంగ వెధవ తన పనేమో చూసుకోరాదా? తన నేదో ఉద్ధరించేందుకు ఆ మంచం కిందినుంచి బైటికి ఎందుకు రావాలి! తన అవస్థేదో తాను పడి, తన మానసంరక్షణకు తనే తంటాలుపడి సమర్థించుకునేది కదా! కాని పనిలో తలదూర్చి అరెస్టయ్యాడు; తన బతుకును కూడా బుగ్గిపాలు చేశాడు. ఇతరుల వ్యవహారాల్లో జోక్యం కలిగించుకొనే యీ పరోపకార పారాయణులు తమను తాము ఎంతగా గాయపరుచుకుంటారో, ఇతరులను ఎలా బాధపెడతారో ఆలోచించరు కదా!

అంతా మించిపొయ్యాక ఇప్పు డింకేమనుకొనీ ఏం లాభం? తాను సత్యాన్ని వెల్లడించి ఎవర్నీ నమ్మించలేదు. ఆ దొంగ చెప్పే మాటలు కూడా ఎవరూ నమ్మరు!

రేపట్నుంచీ తన రంకుతనమేదో పట్టుకున్నవానివలె విశ్వం ఊరంతా టమటమా వాయించి, తన ప్రజ్ఞా విశేషాలను చాటుకుంటాడు. తనను అనవసరంగా అనుమానించి, అవమానించి తన కడుపుమంట తీర్చుకుంటాడు. విశ్వంతో తనకు తెగతెంపులైనవి. ఈ గాయానికి తోడు అవమానాన్ని కూడా తాను భరించలేదు. సాధ్యమైనంత త్వరలో వేరొక ఊరికి వెళ్ళిపోవాలి.

❋ ❋ ❋

ఈ కథలోని మూడు పాత్రలకూ మనశ్శాంతి ఏదో వొక రూపాన ముట్టజెప్ప వలసిన బాధ్యత కథకునికి ఉన్నది. అదెలాగో పరిశీలిద్దాం:

ఆరు నెలలు కఠిన కారాగారవాస శిక్ష అనుభవించిన రాముడు - తాను దొంగగా పట్టుబడి యీ శిక్షకు పాత్రుడైనప్పటికీ - తాను పద్మకు మానభంగం

కాకుండా కాపాడగలిగాననే ఆత్మవికాసంతో ఆనందించాడు. మంచి పనులక్కూడా శిక్ష అనుభవించటమనే న్యాయం ఉన్నదేమో?

పెళ్ళి కాకముందే తనను అనవసరంగా అనుమానించి, తన పట్ల గొప్ప అధికారమేదో ఉన్న విధంగా – అసభ్యంగా, అసహ్యంగా విశ్వం ప్రవర్తించాడు. పెళ్ళే ఐ ఉంటే తనను ఉప్పు పాతరవేసి ఉండేవాడని పద్మ నమ్మింది. అంత్య నిష్ఠూరంకన్న ఆది నిష్ఠూరమే మేలని ఆమె తృప్తి పడింది.

ఈ పద్మ ఇంత నాటకం ఆడిన విషయం, ఆమె రంకు వ్యవహారాలను పట్టుకున్నాడు కనుక తేలిపోయింది. లేకుంటే ఆమెను పెళ్ళాడి, ఈ రంకులాడి భర్తగా భంగపడి ఉండేవాడేకదా! ఈ ప్రేమ వ్యవహారాన్ని త్వరలోనే మరిచిపోవొచ్చు. జరగబొయ్యే మహా ప్రమాదంలో, జరిగింది ఒక చిన్న భాగమేననే తృప్తితో మనశ్శాంతిని సాధించాడు విశ్వం.

– ఆగష్టు, *1969*